క్లుప్తంగా...

నేడు 2కె రన్

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్ విభాగం ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు మల్కాజిగిరి చౌరస్తా నుంచి సఫిల్‌గూడ వరకు 2కె రన్ నిర్వహిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. 2కె రన్‌ను స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీపీ జానకి ప్రారంభిస్తారని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ఆదివారం శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. లోకకల్యాణార్థం ప్రతినెలా రెండో ఆదివారం కల్యాణం నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఉత్సవాలతో పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



వినతి పత్రం అందజేస్తున్న స్రవంతికిశోర్‌గౌడ్

బోడుప్పల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలకు ప్రజాధనం ఎంత ఖర్చు చేస్తున్నారని సమాచారం హక్కు కింద మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్ని నిధులు కేటాయించారు? ఏ ఉత్సవాలు చేస్తున్నారని తదితర విషయాలను అడిగినట్లు వెల్లడించారు. బోడుప్పల్ ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులను కోరారు.

పలువురికి సన్మానం



ప్రశంసాపత్రాన్ని అందుకున్న తులసి రమణాచార్యులు

మల్కాజిగిరి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కార్యాలయంలో ఆదివారం తెలంగాణ అస్తిత్వం అనే అంశంపై కవి సమ్మేళనం జరిగింది. మల్కాజిగిరికి చెందిన తులసి రమణాచార్యులు తన కవితాగానం ద్వారా ఆహుతులను ఆకట్టుకున్నారు. అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డీఆర్‌వో లింగ్యానాయక్, డీఈవో విజయకుమారి తదితరులు సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఆనంద్‌బాగ్‌లో అన్నదానం



మల్కాజిగిరి: బ్రాహ్మణ సేవా సంఘం, సీతారామ గాయత్రి సేవా సంస్థ సహకారంతో ఆదివారం ఆనంద్‌బాగ్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం నాయకులు, గాయత్రి సేవా సంస్థ నిర్వాహకులు భార్గవి పాల్గొన్నారు. ఆనంద్‌బాగ్ కనకరాజు తోటలో బ్రాహ్మణ సేవా సంఘం మల్కాజిగిరి సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కేంద్ర కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, కామేశ్వరరావు, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం తరలిన సీపీఐ నేతలు

కాప్రా: భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు కాప్రా సర్కిల్ నుంచి ఆ పార్టీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ నేతలు సత్యప్రసాద్, లక్ష్మీనారాయణ, కృష్ణ, భిక్షపతి, స్వామి, సాయిలు, నర్సింగరావు పాల్గొన్నారు.

చింతల చెరువు..

భరించలేని కంపు..

కాలనీల నుంచి చేరుతున్న మురుగు

- అవుట్‌లెట్ లేక చెరువులోనే నిలిచిపోయి..
- జల కాలుష్యంతో రోగాల బారిన ప్రజలు
- చేపల మృత్యువాతతో తీవ్ర దుర్వాసన
- జీవనాధారం కోల్పోతున్న ముదిరాజ్‌లు
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం
- మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



మురుగునీటితో నిండిన చింతల చెరువు



చెరువులో చనిపోయి ఒడ్డుకు చేరిన చేపలు

“ బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల–2వ డివిజన్‌లో ఉన్న చింతల చెరువు మురికి కూపంగా మారింది. చెంగిచర్లలోని ఎగువ ప్రాంత కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగునీరు, వర్షపునీరు దిగువకు వచ్చి చింతల చెరువులో చేరుతోంది. అక్కడ నుంచి దిగువ ప్రాంతానికి మురుగునీరు పోయేందుకు అవుట్‌లెట్ లేదు. దీంతో మురుగు నీటితో చెరువు అంతా కలుషితమై భరించరాని వాసన వస్తోంది. చుట్టుపక్కల నివసించే కాలనీవాసులు సదరు మురుగుతో నిత్యం నరకాన్ని చూస్తున్నారు. చెరువులో జల కాలుష్యం ఏర్పడి ముదిరాజ్‌లు పెంచుకుంటున్న చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఇదే విషయమై స్థానికులు అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. –బోడుప్పల్ ”

నాడు తాగునీరు.. నేడు మురికి కూపం

చెంగిచర్లలోని సర్వే నంబర్– 57లో సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో చింతల చెరువు ఉంది. ఒకప్పుడు స్థానిక ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించింది. గడిచిన 5 ఏళ్ల నుంచి సదరు చెరువులో మురుగు చేరి మురికి కూపంగా మారింది. చెంగిచర్లలో గడిచిన ఐదేళ్లలో కొత్త కాలనీలు ఏర్పడగా నూతనంగా ఇళ్లు నిర్మించుకున్నారు. అధికారులు సదరు కాలనీల ప్రజల కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. సదరు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని నేరుగా తీసుకొచ్చి చింతల చెరువులో వదిలారు. అక్కడ నుంచి దిగువకు పోయేందుకు అవుట్‌లెట్ మార్గం లేదు. దీంతో చెరువులోనే మురుగు నిలిచిపోతోంది. ముదిరాజ్ కులస్తులు చెరువునే జీవనాధారం చేసుకుని చేపలు పెంచుకుంటున్నారు. జల కాలుష్యం వల్ల చెరువులో చేపలు చనిపోతుండటంతో వారు జీవనాధారం కోల్పోతున్నారు.

అధికారులు, మంత్రి దృష్టికి సమస్య

చింతల చెరువులో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానిక కాలనీల ప్రజలు, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, అధికారులు కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, మంత్రి చామకూర మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై మంత్రి మల్లారెడ్డి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థల పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఫ్లడ్ వాటర్ క్లోస్డ్ చానల్, మురుగునీటి కాలువల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేశారు.

కేటీఆర్ చేతులమీదగా ప్రారంభోత్సవం..

2022 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థల పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఫ్లడ్ వాటర్ క్లోస్డ్ చానల్, మురుగునీటి కాలువల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లతో శ్రీకారం చుట్టింది. ఎస్‌ఎన్‌డీపీ నిధులు కేటాయించగా మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవం జరిగి 16 నెలలు కావస్తున్నా చెంగిచర్లలో ఇప్పటి వరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇదే విషయమై స్థానిక కాలనీల ప్రజలు పలుమార్లు మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మురికి కూపం మధ్య జీవనం..



గడిచిన ఐదేళ్ల నుంచి మురికి కూపం మధ్య జీవనం కొనసాగిస్తున్నాం. గతంలో మురుగునీరు చెరువులోకి వచ్చేవి కావు. చెంగిచర్లలో పెరిగిన జనావాసాలకు అనుగుణంగా అవుట్‌లెట్ లేపోవడంతో మురుగును చెరువులోకి వదిలి అధికారులు, పాలకవర్గం చేతులు దులుపుకుంది. ఈ సమస్య వల్ల మేం నిత్యం నరకాన్ని అనుభవిస్తూ అనారోగ్యానికి గురవుతున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, సాయినగర్ కాలనీవాసి

ఇళ్లలోకి మురుగునీరు..



చెరువులో నీటి మట్టం పెరిగే కొద్ది డ్రైనేజీ మ్యాన్ హోల్స్ ద్వారా ఇళ్లలోకి చేరుతోంది. దీంతో కాలనీవాసులు మోటార్లు పెట్టి చెరువులోకి వదులుతున్నారు. అదే వర్షాకాలం అయితే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటితో మా కాలనీ మునిగిపోతుంది. కలుషిత నీటితో ముదిరాజ్‌లు పెంచుకుంటున్న చేపలు చనిపోతున్నాయి. అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదు.

– నర్సింహారెడ్డి, సాయినగర్ కాలనీ అధ్యక్షులు

భక్త సమాజానికి బీఎల్‌ఆర్ ఆర్థిక సాయం



భక్త సమాజం సభ్యులకు చెక్కు అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లోని భక్త సమాజం భవనానికి బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం అందించారు. మొదటి అంతస్తులో మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు ఇటీవల భక్త సమాజం సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌ను కలిశారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం నాచారం చేరుకుని రూ.లక్ష చెక్కును అందించారు. నాచారం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. కార్పొరేటర్ సాయిజెన్ శేఖర్, స్థానికులు సాయిబాబా, ప్రేమ్‌కుమార్, జగన్నాథం, యాదగిరి, యాదయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు

మల్కాజిగిరి: దివ్యాంగులకు ఫించన్ మొత్తాన్ని పెంచడంపై మల్కాజిగిరి పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం మల్కాజిగిరి చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుల్తాన్ రమేష్, రియాజ్ భాషా, ఫిలిప్స్, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సేవారత్న అవార్డులు

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన దంపతులు రామకోటేశ్వర్, రజనీ దంపతులకు జాతీయ సేవా రత్న అవార్డు వరించింది. నాచారం హెచ్‌ఎంటీ నగర్ కమ్యూనిటీ హాల్ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వర్ దంపతులకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, మోహన్‌రెడ్డి, అమరేందర్ తదితరుల పాల్గొన్నారు.



జాతీయ సేవారత్న అవార్డు అందుకుంటున్న రామకోటేశ్వర్, రజనీ


అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల



అల్వాల్: అల్వాల్ లోతుకుంటలో విశ్వరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి 14వ వారం జ్ఞాన మాల వేసే కార్యక్రమంలో అల్వాల్ వెంకటాపురం భూదేవినగర్ ప్రాంత డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. నరేష్‌కుమార్, కార్యదర్శి డి.రాజు, ఉపాధ్యక్షులు స్వామి ఆధ్వర్యంలో జ్ఞాన మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎల్.యాదగిరి ఉన్నారు.

అంతా సజావుగానే..

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీపీ డీఎస్ చౌహాన్



కాప్రా: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పరిశీలించారు. ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష సందర్భంగా ఏఎస్‌రావునగర్ రాధిక చౌరస్తా సమీపంలోని ఒమెగా కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సీపీ చౌహాన్ మాట్లాడుతూ.. గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, సెంటర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు.

గ్రూప్ వన్ అభ్యర్థులకు పోలీసుల సాయం

రామంతాపూర్: గ్రూప్ వన్ అభ్యర్థులకు పోలీసులు సాయం అందించారు. నాచారంలోని జాన్సన్ గ్రామర్ స్కూల్ పరీక్షా కేంద్రానికి పలువురు అభ్యర్థులు చేరుకున్నారు. అయితే వారి పరీక్ష కేంద్రం ఇది కాదని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో నాచారం పోలీసులు వారిని తమ వాహనంలో ఎక్కించుకుని పరీక్ష కేంద్రాలకు చేర్చారు. దీంతో అభ్యర్థులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



కాలనీ సంక్షేమానికి సహకారం

మల్లాపూర్: కాలనీల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్ గోకుల్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం కాన్ఫరెన్స్ హాల్, గ్రంథాలయాన్ని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్కయ్య, ఉపాధ్యక్షులు శివరాంప్రసాద్, సభ్యులు రాజు, శేఖర్‌రావు, వీరబాబు, ఎంపీ రెడ్డి, విజయ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఉపయోగించుకోవాలి

మేడ్చల్: వృథా సామాగ్రి సేకరణ కోసం నిర్వహిస్తున్న రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ వార్డు ప్రజలు ఉపయోగించుకోవాలని పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయన కాలనీవాసులతో కలిసి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభించి వార్డులో పర్యటించి వృథా సామాగ్రి సేకరణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో వృథాగా ఉండే చెక్క వస్తువులు, సామాగ్రి, బట్టలు, పుస్తకాలు వంటి ఉపయోగంలో లేని సామాగ్రి ఉన్న వారు సెంటర్‌లో ఇవ్వాలని కోరారు. సామాన్లను సెంటర్‌కు తీసుకువచ్చి ఇవ్వాలని ఆయన కోరారు. పర్యావరణం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

ముదిరాజ్ ఆత్మీయ వనభోజన సమ్మేళనంలో మాజీ మేయర్ బొంతు రాంమోహన్



సమ్మేళనానికి హాజరైన ముదిరాజ్ కులస్తులు

కుషాయిగూడ: న్యాయమైన హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లంతా సంఘటితం అవ్వాలని, తాము అండగా నిలుస్తామని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్ అన్నారు. చర్లపల్లి చెరువు వద్ద ఆదివారం బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ముదిరాజ్ ఆత్మీయ వనభోజన సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప్పల్‌లో 50 వేలకు పైగా ఉన్న ఓటర్లున్న ముదిరాజ్‌లు ఐక్యంగా రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు సొంతం చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ బీసీల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. తెలంగాణలో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తాను మేయర్‌గా కొనసాగిన సమయంలో ఉప్పల్ సమగ్రాభివృద్ధికి రూ.2 వేల కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న చెరువుల అభివృద్ధికి తన తోడ్పాటు అందించినట్లు పేర్కొన్నారు. గ్రేటర్‌లో చేపలు పట్టే చెరువులు ఉన్నాయంటే అది చర్లపల్లి చెరువేనన్నారు. రానున్న రోజుల్లో మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరించి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మతల్లి, మహంకాళి ఆలయాల నిర్మాణాలు, ఉప్పల్ భగాయత్‌లో ముదిరాజ్ భవనానికి స్థలం కేటాయింపు, అమరవీరుడు పోలీసు కిష్టయ్య విగ్రహాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను ముదిరాజ్‌లు ఆయన ముందుంచారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్, బన్నాల గీతా, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గణేష్ ముదిరాజ్, కావ్య, మహంకాళి నర్సింహ, మహేందర్, యాట భాస్కర్, విజయ్‌కుమార్, ఈగ సంతోష్, పిట్టల నాగరాజు, జెల్లా అశోక్, గోపాల్, బొట్టు వెంకట్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, గంధం జ్యోత్స్న నాగేశ్వర్ రావు, బీఆర్‌ఎస్ నేతలు హన్మంతరెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, విద్యాసాగర్, వంజరి ప్రవీణ్, రెగ్గళ్ల సతీష్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ బొంతు రాంమోహన్

బీజేపీలో చేరిన కాప్రా యువకులు



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కాప్రాకు చెందిన యువకులు

కాప్రా: కాప్రా సర్కిల్‌కు చెందిన పలువురు యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో పలువురు యువకులు కాషాయ కండువా కప్పుకున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్‌లో ఈటల రాజేందర్ వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలో చేరినట్లు తెలిపారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే వస్తుందని, రాష్ట్రం కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తే రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంజునాథ, నిదీష్, విజయ్, సమీర్, నితీష్, సిద్ధార్థ, మల్లికార్జున్, జ్ఞానేశ్వర్, తరుణ్, సాయితేజ, కౌశిక్, హరివర్ధన్ తదితరులున్నారు.



నృత్య ప్రదర్శన భళా

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యా నికేతన్ ప్రతిభారాజ్‌గౌడ్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహా గణపతిం, ముద్దుగారే యశోద, అదిగో అల్లదిగో, జానపద నృత్యం, పలుకే బంగారమాయే, దశావతారం, తరంగం, నీలమేఘ శరీర మొదలైన అంశాలను ప్రదర్శించారు. వైష్ణవి, వర్ణిక, సహస్ర, ఈషా, సిద్ధికా, నిత్యశ్రీ, పావని, రాజ్ఞ తదితరుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హైకోర్టు అడ్వకేట్ సందీప్ కుమార్, రామ్‌శెట్టి తదితరులు కళాకారులను ఆశీర్వదించారు.

పద్మశాలీలు ఐక్యంగా రాణించాలి



ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప, యాదాద్రి భువనగిరి జిల్లా పీటీపీఏ అధ్యక్షుడు వనం శాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు ఆడేపు అంజయ్య, దేవసాని బాలచందర్, గౌడ శ్రీశైలం, సకినాల ప్రసాద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర గొప్పది

సాహితీ ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో తెలంగాణ సాహిత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవులు రాసిన పాటలు, పాడిన పాటలు ప్రజల్లో ఎంతో ఉత్తేజాన్ని నింపాయన్నారు. కవులను ప్రభుత్వం గుర్తించడంతో పాటు వారికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో మన సాహిత్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణ తేజోమూర్తుల పేరుమీద పురస్కారాలను అందజేస్తోందని తెలిపారు. రాష్ట్రం అవతరించి పదేళ్లు కావొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాహితీ దినోత్సవాన్ని జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, కవుల కవితా సంపదతో విరాజిల్లుతోందన్నారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని, సాహితీరంగంలో తమదైన ముద్ర వేసిన మొదట కావ్యం, మొదటి కవి అందరూ మన తెలంగాణవాదులేనన్నారు. ఈ సందర్భంగా కవులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, పారితోషికాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బలరామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, శామీర్‌పేట ఎంపీపీ దాసరి ఎల్లుబాయి, శామీర్‌పేట జెడ్పీటీసీ అనిత, మేడ్చల్ జెడ్పీటీసీ శైలజారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్మన్ పావని, కవులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.